ప్రజాశక్తి

శుక్రవారం 30 మే 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

డీఎస్సీకి ముమ్మర కసరత్తు



- పరీక్షల ఏర్పాట్లలో అధికారులు - శిక్షణలో అభ్యర్థులు
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు విడుదల
- మొత్తం పోస్టులు : 1143
- అభ్యర్థులు : 25,067 మంది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిఎస్‌సి పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. పరీక్షలు వచ్చేనెల 6 నుంచి జులై 6 వరకు ఆన్‌లైన్‌లో ఆయా కేటగిరీల వారీగా జరగనున్నాయి. పరీక్షా కేంద్రాలు రెండు రోజుల్లో ఖరారు కానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పొందుపర్చిన 1,143 పోస్టులకు 25,067 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు గల అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతో పాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలిపి ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో పురుష అభ్యర్థులు 8,431 మంది ఉండగా, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. డిఎస్‌సికి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో హాలు టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులు ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్‌జిటి 521 ఉన్నాయి. వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లీషు 69, గణితం 35, భౌతికశాస్త్రం 58, జీవశాస్త్రం 86, సోషల్ 109, పిఇటి 166తో పాటు సెకండరీ

▶ 2లో

ఎఎన్‌యులో నైపుణ్య శిక్షణ కేంద్రం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు పెంపునకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదన పంపామని ఆయన గురువారం మీడియాకు తెలిపారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అమరావతిలో ఎంఎస్‌ఎంఇ నైపుణ్య కేంద్రం ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా మంజూరైన శిక్షణ కేంద్రాన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యానికి అనుగుణంగా ఈ కేంద్రం ద్వారా యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నైపుణ్య కేంద్రానికి అనుసంధానంగా ఒక స్పోక్ హబ్‌ను మంజూరు చేశారని తెలిపారు. ఇంజినీరింగ్, నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. దూరవిద్యా కేంద్రంలోని ఉత్తరం వైపు ఉన్న మూడు అంతస్తుల్లో నైపుణ్య కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. సుమారు 30 వేల అడుగుల స్థలాన్ని ఇచ్చేందుకు వర్సిటీ అధికారులు అంగీకరించారు. 35 ఏళ్లపాటు అద్దె ప్రాతిపదికన ఈ స్థలాన్ని కేటాయించారు. మొత్తం 20 టెక్నో సైన్స్, ఎంబీఏ చదివే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. పరిశ్రమలకు కావాల్సినట్లు ఉద్యోగాలు సాధించేలా శిక్షణ రూపకల్పన చేస్తున్నారు. యంత్రాల వినియోగం, వ్యాపారం, మార్కెట్, ముడి సరకును ఎలా కొనుగోలు చేయాలి? తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. మరింత ప్రోత్సహించేందుకు వారికి కావాల్సిన మానవ వనరులు అందించేందుకు వర్సిటీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సమాచారం ఇచ్చింది.



8 లో

ఉపాధ్యాయుల పడిగాపులు



5 లో

తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

పోలీసుల తీరుపై ప్రజాసంఘాల మండిపాటు

పొగాకును కొనకుంటే ఆందోళన ఉధృతం

గుంటూరు ఛానల్, నల్లమడ వాగు ఆధునీకరణ పనులను సత్వరమే చేపట్టాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - పెదనందిపాడు

నల్ల బర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాలతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో రైతుసంఘం నాయకులు డి.రమేష్‌బాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రైతులు నల్లబర్లీ పొగాకు సాగుచేశారని, పంటచేతికొచ్చినా ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడం దారుణమని అన్నారు. పంటనంతా కొంటామని సిఎం, వ్యవసాయ శాఖ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు ప్రకటించినా కొనుగోళ్లను ఇప్పటికీ



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

▶ 2లో

సూర్యకుమారితో రాయపాటి శైలజ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ గురువారం రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సూర్యకుమారిని కలిశారు. మహిళా కమిషన్ విధివిధానాలతోపాటు పలు అంశాలపై చర్చించారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు సంబంధించి వారు పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, మహిళపై దాడులు, అఘాయిత్యాలపై స్పందించేందుకు 'అంతర్గత ఫిర్యాదులు కమిటీ'లు ఏర్పాటు చేయాలని సూర్యకుమారి సూచించారు. మహిళా కమిషన్ భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళిక తదితర అంశాలపై మాట్లాడారు.

పల్నాడులో ఆదిమానవుడి ఆనవాళ్లు

యునెస్కోకు తెలంగాణలోని నిలువురాళ్లు - చెరిగిపోయే దుస్థితిలో ఇక్కడ వేల ఏళ్లనాటి నిలువురాళ్లు


గంగలకుంట అటవీప్రాంతంలోని నిలువురాళ్లు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల ప్రాంతాల్లో నిలువురాళు (మెన్హిర్లు), రాకాసిగూళ్లు వంటి ఆదిమ మానవుల సమాధులు వేల సంఖ్యలో ఉన్నాయి. గతించిన చరిత్రకు సాక్షంగా నిలిచిన స్మారకాల విలువేంటో తెలియని స్థానికులు వాటిని తొలిగించి భూమి చదును చేసుకోవటమో, నిర్మాణ అవసరాలకు వాడుకుంటుండగా, నిధుల వేటగాళ్ళ చేతుల్లో పడి ధ్వంసమైనవి కొన్ని, మరికొన్న శిథిలమై కాలగర్భంలో కలిసిపోయాయి. దాంతో ఆదిమ కాలం నాటి ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. ఇటీవల తెలంగాణా రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా, కష్ణా మండలం ముడుమాల్ శివారులో కృష్ణానది ఒడ్డున ఉన్న నిలువురాళ్లు త్వరలో ప్రపంచ వారసత్వ ప్రాంతంగా గుర్తింపు పొందే అవకాశముంది. ఈ మేరకు యునెస్కో గుర్తింపును కోరుతూ మన దేశం నుంచి ఈ నెల 7న ఆరు ప్రఖ్యాత ప్రాంతాలను ప్రతిపాదించారు. దానిలో ముడుమాల్ నిలువురాళ్ల చోటు దక్కించుకొంది. ఈ నేపథ్యంలో కృష్ణానదికి అటు ఓడ్డున ఉన్న నిలువు రాళ్లను పోలినవి నదికి ఇటువైపున పల్నాడు జిల్లాలో కృష్ణానది పరివాహక ప్రాంతం, వాగులు వెంట ఉన్నాయి. అయితే ఇవి చాలా వరకు చరిత్ర గర్భంలో కలిసిపోగా, నాటి చరిత్రకు సాక్షంగా ఇంకా మేమున్నామంటూ కొన్ని నిలువురాళ్ల నేటికి నిలిచి ఉన్నాయి. ఇవి కూడా కనుమరవగక ముందే, వేల ఏళ్ల నాటి చరిత్రను తెలిపే అరుదైన వారసత్వ సంపదను రక్షించాలని చరిత్ర కారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆదిమానవుల ఆవాసం పల్నాడు

జలం ఎక్కడైతే సంమృద్ధిగా ఉన్నదో అక్కడ నాగరికత వర్థిల్లింది. నదులు, వాగులు, వంకలు పరిసర ప్రాంతాల్లో ఆదిమ మానవులు నివసించేవారు. పల్నాడు ప్రాంతలోని కృష్ణానది


శిథిలమై కూలిపోయిన మెన్హిర్

పరివాహక ప్రాంతం, పల్నాడులో పుట్టి పల్నాడులో ప్రవహించి కృష్ణానదిలో కలిసే వాగులు, వంకల తీర ప్రాంతాల్లో ఆదిమ మానవుల ఆనవాళ్లు ఉన్నాయి. క్రీ.పూ. 2 లక్షల ఏళ్ల నుండి పల్నాడు ప్రాంతంలో ఆదిమ మానవులు జీవించినట్లు పురావస్తుశాఖ పరిశోధకులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి, ఇక్కడ లభించిన వస్తువులను పరిశోధించి ఆ కాలంనాటి మానవుల జీవిత విశేషాలను తెలుసుకున్నారు.

పాత రాతి యుగం నుండి క్రీ.పూ. 2 లక్షల సంవత్సరాల నుండి మధ్యరాతి యుగం క్రీ.పూ 4వేల సంవత్సరాల వరకు ఆదిమ మానవులు మొదటగా వేట ప్రధానంగా ఆహార సేకరణ, ముడి రాయి, పెచ్చురాయి, రాయిని సానపెట్టి ఆయుధాలు చేసుకొని జంతువులు వేట, ప్రకృతి సిద్ధంగా లభించే దుంపలు, పళ్లను ఆహారంగా తీసుకొనే వారు. కొండ గుహలు, కొండ చరియల్లో జీవించేవారు. సహజసిద్ధంగా లభించే రంగులతో వారు నివసించిన గుహల్లో, రాతిపై బొమ్మలు గీసేవారు. వారు గీసిన బొమ్మలు, వాడిన రాతి పనిముట్లను నాగార్జునకొండ లోయ, కారంపూడి, దాచేపల్లి, కొప్పునూరు, గంగలకుంట, నాగులేరు తీర ప్రాంతంలో పురావస్తు పరిశోధకులు గుర్తించారు. కొత్త రాతి యుగంలో కంచు, రాగితో పనిముట్ల తయారు చేసుకున్నారు. ఆహార ఉత్పత్తి నేర్చుకున్నారు. పంటలు పండించటం, పశువులను మచ్చిక చేసుకుని సమూహాలుగా నివశించేవారు.

ఇనుప యుగంలో ఇనుముతో వస్తువులు తయారు చేసి వాడేవారు. చనిపోయిన వారిని శవపేటికలోగాని, రాతిచట్టుతో కానీ పెట్టి పూడ్చి ఆ గూడు చుట్టూ పెద్ద పెద్ద రాళ్లను వలయాకారంలో నిలిపేవారు. వీటిని రాక్షసగుళ్లు అని స్థానికులు పిలుస్తుంటారు. శవాన్నిగానీ, చనిపోయిన వారి అస్థికల్ని గానీ సమాధుల్లో ఉంచి వారికి సంబంధించిన వస్తుసామాగ్రీ పూడ్చిపెట్టేవారు. భూమి ఉపరితలంపై రాతి పలకలు నాలుగువైపులా నిలిపి, వాటిపై పెద్దరాతితో మూసేవారు ఇలాంటి పెట్టె సమాధులల్లో కొన్నిటికి ఒక వైపు రంధ్రం పెట్టేవారు. వీటిని డాల్మెన్ సమాధులని అంటారు. ఇటువంటి సమాధులు మాచర్ల మండలం అచ్చమ్మకుంటతండా అటవీప్రాంతం, రెంటచింతల మండలం పాలువాయి, పొలేపల్లి, తంగెడ, పిన్నెల్లి గ్రామాల పరిసరాలలో ఉన్నాయి. భూమిలోపల పెద్ద గోయి తీసి నాలుగు పక్కల రాతిపలకలు పెట్టి శవాన్ని


మెన్హిర్ ఎదుట నిధుల కోసం సమాధిని దుండగులు 15 అడుగుల త్రవ్విన గుంత

భూస్థాపితం చేసి చుట్టూ పెద్ద రాతిగుండ్లను వలయాకారంలో పేర్చిన సమాధులను సిస్ట్ బరియల్ అంటారు. ఇటువంటి సమాధులు నాగార్జునకొండలోయ, తేరాల, గంగలకుంట, మల్లవరం, తుమృకోట, మాడుగుల, గుత్తికొండ, నరమలపాడు, గొట్టిపాళ్ల, పశువేముల గ్రామాల పరిసరాలలో ఉన్నాయి.

నిలువురాళ్లు (మెన్హిర్)

మెన్హిర్ అంటే ఆదిమానవుల సమూహంలో ముఖ్యమైన వ్యక్తులు మరణిస్తే వారి స్మారకార్థం సమాధి వద్ద పాతే నిలువు రాయి. అంతే గాక ఈ నిలువురాళ్ల నీడల ఆధారంగా సూర్య గమనాన్ని లెక్కించి సమయం, రుతువులు, ఉత్తర, దక్షిణాయ ణాలను నిర్ధారించుకునే వారని చరిత్రకారులు చెబుతారు. ఇటువంటివి కారంపూడి నాగులేరు ఒడ్డున, రెంటచింతల మండలం మల్లవరం అటవీ ప్రాంతం, పులిచింతల ముంపు గ్రామాల అటవీ ప్రాంతాలు, దుర్గి మండలం తేరాల, వెల్దుర్తి మండలం గంగలకుంట అటవీ ప్రాంతంలో ఉన్నాయి.

కారంపూడి మెన్హిర్

కారంపూడి వద్ద కృష్ణానదికి ఉపనది అయిన నాగలేరు ఎడమ ఒడ్డున పెట్రోగ్లిఫ్స్ అని పిలువబడే రాతి నగిషీలతో కూడిన మెన్హిర్ ఉన్నది. ఇది క్రీ.పూ. వెయ్యేళ్ల క్రితం నాటిది. 19 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పులో ఈ నిలువరాయిపై ఎద్దు, నెమలి, పులి ఇతర జంతువు ఆకారాలు, మానవ ఆకారాలు, వృత్తాకారాలు చెక్కబడి ఉన్నాయి. దీని ద్వారా చరిత్రపూర్వ మానవ జాతి యొక్క ఆచార ఆరాధనలు, వేట, జంతువులతో సహజీవనం వంటి విషయాలు తెలుసుకొన్నాము.

గంగలకుంట నిలువురాళ్లు

వెల్దుర్తి మండలం, గంగలకుంట అటవీప్రాంతంలో కృష్ణానది కుడిగట్టుపైన గల ముగ్గుదిన్నె కాలువకు ఇరువైపుల 500కు పైగా సమాధులు 4 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. కొన్ని సమాధుల వద్ద నిలువురాళ్లు పాతి వున్నాయి. వీటిని పరిశీలించిన విశ్రాంత పురావస్తు అధికారి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు గుర్తించిన నిలువురాళ్లల్లో ఇవే అధిక ఎత్తుగల మెన్హిర్లు అని, ఇక్కడి సమాదులు క్రీ.పూ. 3వేల సంవత్సరాల నాటివని తెలిపారు. 5 నుంచి 10 మీ. వ్యాసంతో, 1 నుంచి 2 మీ.ల ఎత్తులో స్థానిక నాపరాళ్లను గుండ్రంగా పేర్చి, ఆపైన గులకరాళ్లతో ఉబ్బెత్తుగా అమర్చిన సమాధుల్లో, నాలుగురాళ్లను ఒక గదిలా అమర్చి, అందులో శవాలను పాతిపెట్టి, పైన కప్పు బండల్ని పెట్టారు. ఈ సమాధులకు ఉత్తరం వైపు, 10 నుంచి 25 అడుగుల ఎత్తు, 3 నుంచి 5 అడుగుల వెడల్పు, 6 అంగుళాల మందంగల నిలువు రాళ్లను నిలిపారు. ఆ నిలువురాళ్ల పైన ఎద్దు, చదరం, గుండ్రం, జంతువులు, మానవ ఆకారాలు, ముగ్గును పోలిన చిత్రాలున్నాయి. ఇవి ఇనుపయుగపు మానవుల అంత్యక్రియ పద్ధతుల్ని తెలియజేస్తున్నాయి.

రక్షిత ప్రాంతంగా గుర్తించాలి



గంగలకుంట అటవీ ప్రాంతంలో వందల సంఖ్యలో ఆదిమ మానవులు సమాధులు, నిలువురాళ్లు ఉండేవి. స్మారక సమాధులపై స్థానికులకు అవగాహన లేక మైనింగ్, వ్యవసాయ పనుల్లో భాగంగా తొలిగించారు. మరికొన్ని నిలువురాళ్లు ప్రకృతి విపత్తులకు సమాధుల వద్దే కూలి పడివున్నాయి. దుండగులు కొన్నిటిని నిధుల కోసం తవ్విపడేశారు. ప్రస్తుతం కొన్ని మాత్రమే మిగిలాయి. అందులో అరుదైన 25 అడుగుల పొడవైన నిలువురాయి వున్నది. పురావస్తు శాఖ వారు ఈ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించి, వీటిని సంరక్షించాలి, యునెస్కో గుర్తింపును కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాలి. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది.

పావులూరి సతీష్‌బాబు, చరిత్ర పరిశోధకులు, రచయిత. మాచర్ల.


మెన్హిర్ పై ఇనుముతో చెక్కిన చిత్రాలు

డీఎస్సీకి ముమ్మర కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి. ఆగస్టు మొదటి వారం కల్లా పోస్టుల భర్తీ చేస్తారని చెబుతున్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తయినందున ఆయా కేటగిరీల వారీగా ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే విషయమై జులై చివరి వారంలో స్పష్టత రానుంది.

పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు శిక్షణలో తలమునకలై ఉన్నారు. కొంత మందికి డిఎస్‌సి శిక్షణ పూర్తయింది. ఇంటి వద్ద ప్రాక్టీసు చేసుకుంటున్నారు. ఇప్పటికే మాక్‌టెస్ట్‌లు నిర్వహించారు. జూన్ 6వ తేదీ నుంచి జులై ఆరు వరకు ఆయా కేటగిరీల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఈసారి డిఎస్‌సికి కూడా ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పరీక్షలు నిర్వహిస్తుండటంతో కంప్యూటర్‌లో ఆన్‌లైన్ పరీక్షలు రాయడంలో అనుభవం లేని వారు ఇప్పటికే ఇందుకు సంబంధించిన శిక్షణను కూడా తీసుకుంటున్నారు. గుంటూరులో 11 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా ప్రాథమిక విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఇప్పటికే ప్రతి పంచాయతీలో మోడల్ పాఠశాల ఏర్పాటుకు కసరత్తు పూర్తి చేసింది. ప్రాథమిక స్థాయిలో ఒకటి నుంచి ఐదు వరకు ఒక పాఠశాల ఉండేలా అధికారులు హెతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేశారు.

ఉమ్మడి జిల్లాలో 3139 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 711 పంచాయతీల్లో మోడల్ పాఠశాలలు ఏర్పాటు అవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 12,500 మంది వరకు ఉపాధ్యాయులు పని చేస్తుండగా దాదాపు 3500 మందిని మోడల్ పాఠశాలలకు కేటాయించారు. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. మోడల్ పాఠశాలలు పోను మిగతా 2428 పాఠశాలల్లోనే డిఎస్‌సి ద్వారా భర్తీ అయ్యే పోస్టులకు సంబంధించిన ఖాళీలను భర్తీ చేయనుండటంతో ఆగస్టు నాటికి ఉండే ఖాళీలకు అనుగుణంగా భర్తీ ప్రక్రియ జరగనుంది.

పొగాకును కొనకుంటే ఆందోళన ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించలేదని విమర్శించారు. ఈ చర్యలు రైతుల్ని దగా చేయడమేనన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపుకు, నల్లమడ వాగు ఆధునికరణకు నిధులు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినా నిధులు మాత్రం కేటాయించలేదని అన్నారు. నిధులను కేటాయించడంతోపాటు పనులను సత్వరమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల్లో నల్లబర్లీ పొగాకును సన్న, చిన్నకారు రైతులు అధిక కౌలు చెల్లించి సాగు చేశారని, వారి వద్ద పంట కొనేవారే కరువయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. కనీసం రూ.4 వేలకు కూడా కొనే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం, కంపెనీల తీరు కారణంగా సాగుదార్లు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సత్వరమే కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. నల్లమడ అడవుల్లో నుండి ప్రవహిస్తున్న దాదాపు 125 కిలోమీటర్లు ప్రయాణించే వాగు చిలకలూరిపేట, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు, బాపట్ల, కర్లపాలెం మండలాల్లో వర్షాకాలం వస్తే వాగు పొంగి కట్టలు తెగి లక్షలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. వాగులు వెడల్పు చేయడం మలుపుల వద్ద సరిచేయడానికి భూసేకరణ అవసరమని, దాదాపు రూ.310 కోట్లు నల్లమడ ఆధునికరణకు అవసరమని అధికారులు అంచనా వేశారని గుర్తు చేశారు. ఇంత ప్రాధాన్యత కలిగిన నల్లమడ ఆధునీకరణకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, లేకుంటే దశల వారీగా ఆందోళనకు పూనుకుంటామని చెప్పారు. ఈ మేరకు తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, పి.శేషగిరిరావు, కె.చంద్రావు, పెన్షనర్ సంఘం నాయకులు జి.రమేష్, నూర్‌బాష సుభాని సాహెబ్, సిఐటియు నాయకులు ఫణిదపు భువనేశ్వరి, ఎం.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎ.ఆశీర్వాదం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ఆనంద్

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి తెనాలి రూరల్

లైంగిక వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై ఆనంద్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం గత నెల 24న గుడివాడకు చెందిన వివాహిత కామంచి ఆమని(28)ని అదే గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ బాబు లైంగికంగా వేధిస్తున్నాడని మనస్థాపానికి గురై గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటినుంచి పరారీలో ఉన్న నిందితుడు మహేష్ బాబును అరెస్టు చేశారు. కేవలం మహేష్ బాబు వేధింపులతోనే ఆమని ఆత్మహత్యకు పాల్పడిందని, అతనిపై రూరల్ పోలీస్ స్టేషన్ లోనే ఇప్పటివరకు ఏడు కేసులు నమోదైనట్లు చెప్పారు. నిందితుడు పై రౌడీ షీట్ కూడా ఉందన్నారు. అతనిని కోర్టుకు హాజరు పరచగా మెజిస్ట్రేట్ వచ్చేనెల 11 వరకు రిమాండ్ విధించారని, నిందితుడిని నరసరావుపేట సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కట్నం వేధింపులతో ఆత్మహత్య

ప్రజాశక్తి - తాడికొండ

అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో వివాహిత ఉరివేసుకొని మృతి చెందిన ఘటన మండలంలోని నిడముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. తాడికొండ సిఐ కే వాసు వివరాలు ప్రకారం నిడుముక్కల గ్రామనికి చెందిన తడిగిరి సునీల్ అమరావతి మండలం ఎండ్రాయి గ్రామానికి చెందిన తడిగిరి పావని మూడు సంవత్సరాల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కట్నం తీసుకురమ్మని పావనిని సునీల్ వేధించసాగాడు. మృతురాలు పావని అత్తమామలైన గీత,శ్రీనివాసరావు సునీల్‌కు సహకరించారు. వేధింపుల తాళలేని పావని 24వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్పృహ తప్పిపోయిన పావని కుటుంబ సభ్యులు గుంటూరు జి జి హెచ్ కు చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న పావని తల్లిదండ్రులు జిజిహెచ్ కు చేరుకొని పావని ఒంటిపై గాయాలు గమనించి, భర్త సునీల్ అత్తమామలపై చర్యలు తీసుకోవాలని స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పావని బుధవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రెయినేజీలో మృతదేహం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆటోనగర్ లో సైడ్ కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మద్యం మత్తులో పడిపోయి ఉండొచ్చు అంటూ స్థానికులు అంటున్నారు. పట్టణ ఎస్సై రవీందర్ నాయక్ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కండేయ కాలనీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తిగా గుర్తించినట్లుగా తెలిపారు. మతి చెందిన వ్యక్తి అవివాహితుడు వయసు సుమారు 30 నుండి 35 సంవత్సరాలు ఉంటాయని అన్నారు. మృతదేహాన్ని స్వాధీన పరుచుకొని పోస్టుమార్టం పంపినట్లుగా తెలిపారు.

బంగారు ఆభరణాలుచోరీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు అపహరించుకు పోయిన సంఘటన సత్తెనపల్లి పట్టణంలోని వెంకటపతినగర్‌లో జరిగింది. వెంకటిపతి నగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్ భార్యను పుట్టింటిలో వదిలేందుకు బుధవారం నరసరావుపేట వెళ్ళాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు తీసి ఉండటం గమనించి ఇంట్లో కి వెళ్లి పరిశీలించగా బంగారు ఆభరణాలు అపహరణ గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.సుమారు2లక్షలు విలువైన 32 గ్రాముల బంగారపు చైన్ ఉంగరాలు అపహరణ గురైనట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో ముగ్గురు బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

గతంలో మద్యం కేసులలో ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈపూరు మండలం భద్రుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో అలాగే రొంపిచర్ల మండలం రొంపిచర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని రొంపిచర్ల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటు సారాయి, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి సమా చారం ఉన్న స్థానిక పోలీసులకు తెలపాలన్నారు.

చెరువులో మృతదేహం

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు - పెదపరిమి మధ్య తానాపతి చెరువులో మృతదేహం ఉండడం కలకలం రేపింది. గుర్తు తెలియని మతదేహం నీళ్ళల్లో బోర్లాపడి ఉంది. మృతదేహాన్ని పోలీసులు బయటికి తీశారు. మృతుని వయసు సుమారు 40 నుండి 45 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసినవారు 9440900860,7036320909 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

పిడుగుపాటుతో గేదె మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మండలంలో గురు వారం కురిసిన అకాల వర్షానికి, పిడుగు పాటుకు ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు గ్రామానికి చెందిన పాడి రైతు మోటేపల్లి పృధ్వీకి చెందిన గేద మృతి చెందింది. ఈ సందర్భ ంగా పాడి రైతు మోటేపల్లి పృధ్వీ మాట్లాడుతూ రోజు మాదిరిగానే తనకున్న గేదెలను మేపుకునేందుకు కృష్ణ నది పరివార ప్రాంతానికి వెళ్లానని, గురువారం కురిసిన అకాల వర్షంకు ఒకసారిగా పిడుగు పడటంతో పాడి గేదె మృతి చెందిందని అన్నారు. పాడినే జీవనాధారం చేసుకొని జీవిస్తున్న తనకు పాడిగేదె చనిపోవడం బాధ కలిగించిందని అన్నారు. ఘటన జరిగిన వెంటనే రెవిన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. లక్ష రూపాయల విలువ ఉంటుందన్నారు. తనకు ప్రభుత్వం సహాయం అందించాలని ఆయన కోరారు.





మోటార్ల చోరీలను అరికట్టాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి రైతుల పంట పొలాల్లో జరిగిన కరెంటు మోటార్ దొంగతనాలను అరికట్టాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ మోటార్ చోరీ జరిగిన ఈశ్వర్ రెడ్డి పంట పొలాన్ని గురువారం రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులు అప్రమత్తంగా ఉండి దొంగల బారి నుండి మోటార్లను రక్షించుకోవటానికి కమిటీలుగా ఏర్పడాలని, గస్తీ గూడా తిరగాలని సూచించారు. అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సనగం కోటేశ్వరావు,రైతు సంఘ గ్రామ ఉపాధ్యక్షుడు పి వీరాస్వామి, బక్కి రెడ్డి, పాల్గొన్నారు.



అశాస్త్రీయ, మూస విద్యా ధోరణులే విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం

అవగాహన సంస్థ చర్చా గోష్టిలో వక్తలు

ప్రజాశక్తి - గుంటూరు

మార్కులు, ర్యాంకులు తప్ప విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పట్టించుకోని అశాస్త్రీయ మూస విద్యా ధోరణలే విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమని అవగాహన సంస్థ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్తలు, విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'భావితరాన్ని విపరీతమైన ఒత్తిడికి గురి చేస్తున్న చదువులు' అన్న అంశంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యావేత్త, విశ్రాంత ప్రిన్సిపల్ ఎస్. రవిబాబు మాట్లాడుతూ గడిచిన రెండు మూడు నెలల్లోనే తెలుగు రాష్ట్రాల్లో పలువురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం, మధ్యప్రదేశ్ లోని ఇండోర్‌లో తాజాగా రెండు రోజుల్లో నలుగురు విద్యార్థులు, రాజస్థాన్ లో కోటాలో ఈ ఏడాదిలో ఇంతవరకు 15 మంది విద్యార్థులు తమకు తామే మరణ శాసనాలు రాసుకోవడం తీవ్ర ఆందోళనకు గురిచేసే విషయమన్నారు. భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన చదువులు భావితరాన్ని విపరీతమైన వత్తిడికి గురి చేస్తున్నాయని ఈ ఆత్మహత్యలే నిరూపిస్తున్నాయన్నారు. విశ్లేషకులు ఆర్.వి సింగరయ్య మాట్లాడుతూ ఈ పదేళ్ళలో ఒక లక్ష పది వేల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు అధికార గణాంకాలే తెలియజేస్తున్నాయని, హైస్కూల్ దశ నుండే విద్యార్థులు కుంగుబాటుకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు తమ అభిరుచులకు తగిన కోర్సులను ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని, విద్యా సంస్థల్లో మానసిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, బోధనలో సజనాత్మకతకు పెద్దపీట వేయాలని, పిల్లల ప్రజ్ఞా పాటవాలను గుర్తించాలని అన్నారు. ఈ చర్చా కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నంలు ప్రసంగించారు.

ప్రపంచ పర్యావరణ సంస్థ గౌరవ అధ్యక్ష, అధ్యక్షులుగా

డాక్టర్ అనిత, భార్గవ్ నియామకం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రపంచ పర్యావరణ సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా డాక్టర్ జి.అనిత, అధ్యక్షుడిగా బి.ఎస్.భార్గవ్ కుమార్‌ను నియమించామని ఆ సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.భద్ర తెలిపారు. ప్రొఫెసర్ అనిత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యం జర్నలిజం విభాగం హెడ్‌గా ఉండిఎంతో మంది జర్నలిస్టులను సమా జానికి అంది ంచారని తెలిపారు. అలాగే భార్గవ్ జర్నలిస్ట్‌గా కెరీర్‌ను ప్రారభించి తద నంతరం ఎఎన్‌యు జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారని, ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టు న్యాయవాదిగా ఉంటూనే పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారిని ఆయా పదవుల్లో నియమిం చామని తెలిపారు. తమ సంస్థ ఎంపి, తెలంగాణాల్లోనే కాకుండా సుమారు ఎనిమిదికిపైగా రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. దుబాయ్ లాంటి దేశాల్లోనూ పర్యావరణ పరిరక్షణకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. గాలి కాలుష్యం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 16 లక్షల మందిపైగా మరణిస్తున్నారని తెలిపారు. ప్రపంచం మొత్తం జనాభాలో సుమారు 70 మంది శాతం మంది కలుషిత నీరు తాగుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు అడవుల విధ్వంసం పెరిగి పోతోందన్నారు. సుమారు 35 వేల హెక్టార్లలోని చెట్లను ఇప్పటికే కొట్టేశారని, దీంతో గాలి, నీరు, భూమి కలుషితంగా మారి మానవ జీవనానికి ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమం, సేవ్ నేచర్, ప్రొటెక్ట్ వాటర్ సోర్స్ లాంటి కార్యక్రమాలను ప్రపంచ పర్యావరణ సంస్థ నిర్వహిస్తోందన్నారు. భార్గవ్ మాట్లాడుతూ సమాజంలో ప్రకతి పట్ల ప్రేమను పెంపొందించే విధంగా భవిష్యత్తులో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.



డాక్టర్ అనిత



బిఎస్ భార్గవ్‌కుమార్



రెంటపాళ్లలో ఏర్పాట్లపై చర్చించుకుంటున్న నాయకులు

3న రెంటపాళ్లకు జగన్ రాక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చేనెల 3న మండలంలోని రెంటపాళ్లకు రానున్నారు. ఆ పార్టీ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ అయిన కొరకుంట శివనాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని జగన్ పరామర్శించనున్నారు. శివనాగమల్లేశ్వరరావు ఏడాది కిందట ఆత్మహత్యచేసుకోగా సంవత్సరికం సందర్భంగా గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఆవిష్కరించేందుకు జగన్ రానున్న నేపథ్యంలో గ్రామాన్ని వైసిపి కో-ఆర్డినేటర్ తలసరి రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి విడుదల రజిని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి గురువారం సందర్శించారు.

3న డిఎస్‌సి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని క్రిష్ణవేణి జూనియర్ కాలేజి ఆవరణలో జూన్ 3వ తేదీన డిఎస్‌సి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక నాయకులు జెవికెఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. డిఎస్‌సి పరీక్ష రాసే అభ్యర్థుల కోసం డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్, జెవివి సంఘాలు సంయుక్తంగా ఈ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి పరీక్షల రాయటం వల్ల అభ్యర్థులకు వారు ఎంత వరకు ప్రిపేర్ అయ్యారనే అంశం అవగాహనకు వస్తుందని, ప్రధాన పరీక్షకు మరింత సమగ్రంగా తయారు కావడానికి ఉపకరిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9491218777, 8341151692, 799310062８కు ఫోను చేసి రూ.50 చెల్లించి నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇఎస్ఐ కార్డుదారులకు నగదు రహిత వైద్యం

డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఒకటో తేదీన ఉచిత వైద్యశిబిరం

మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇఎస్ఐ ద్వారా మెరుగైన ఉచిత వైద్య సేవలు కోసం విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నరసరావుపేటలోని తమ హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఉచిత మెగా వైద్య శిబిరంలో కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యురాలజీ, నెఫ్రాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, న్యూమరాలజీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, బిపి, ఈసీజీ, 2డి ఎకో, షుగర్,కిడ్నీ మూత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. పల్నాడు జిల్లాలో ఇఎస్ఐ ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్న ఏకైక హాస్పిటల్ తమదేనన్నారు. వచ్చే ఆదివారం తమ హాస్పిటల్ నందు ఇఎస్ఐ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు తప్పనిసరిగా తమ వెంట ఇఎస్ఐ, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలు తెచ్చుకోవాలని సూచించారు.

మున్సిపల్ నీటిలో పురుగులు.. నిత్యం లీకులు..

- 35 ఏళ్లనాటి పైపులైన్లతోనే సరఫరా
- రోగాల భయంతో పట్టణవాసులు





రాగన్నపాలెంలో సరఫరా అయిన మున్సిపల్ నీటిలో పురుగులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపాల్టీ సరఫరా చేసే నీరు రంగు మారి ఉండడంతోపాటు పురుగులు వస్తుదన్నాయి. వర్షాలు వస్తుండడంతో పైపులైన్లు ఎక్కడంటే అక్కడ లీకులు ఏర్పడిన కారణంగా నీరు కలుషితమవుతున్నట్లు తెలుస్తోంది. పట్టణ జనాభా సుమారు 1.60 లక్షల వరకు ఉంటుంది. 24 కిలోమీటర్లలో విస్తరించి ఉన్న పట్టణంలో 12 కిలోమీటర్ల వరకు ప్రధాన పైపులైను ఉంది. వీటి నుండే ఇళ్లకు నీటి కుళాయి కనెక్షన్ ఇస్తున్నారు. పట్టణంలో అధికారికంగా ప్రస్తుతం 16,650 తాగునీటి కుళాయి కనెక్షన్లు, మరో 400 పబ్లిక్ ట్యాపులు ఉన్నాయి. పైప్‌లైన్ ద్వారా రోజుకు కోటి 20 లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతుంది. ప్రధాన పైపులైను 35 ఏళ్ల కిందట వేసిన సిమెంట్ పైపులైన్ కావడంతో నిత్యం ఎక్కడంటే అక్కడ లీకులు ఏర్పడుతున్నాయి. చౌత్రాసెంటర్, గడియార స్తంబం నుండి కళామందిర్ సెంటర్ వరకు, కృష్ణమహల్ సెంటర్‌లో నిత్యం లీకులు ఏర్పడుతూనే ఉన్నాయి. మున్సిపాల్టీ పలుమార్లు మరమ్మతులు చేయించినా అదే ప్రాంతంలో, మరో ప్రాంతంలో లీకులు మాత్రం ఆగడం లేదు. దీంతో తరచూ నీరు రంగుమారడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణంలోని 40 శాతం మంది వాటర్‌ప్లాంట్ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేస్తుండగా మిగతా 60 శాతం మంది ప్రజలు మున్సిపాల్టీ సరఫరా చేసే నీటిపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం వీరుకూడా మున్సిపాల్టీ నీరు తాగాలంటే భయపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీన్ని ఆసరా చేసుకుని నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. రూ.2 రూపాయల క్యానును రూ.10కి అమ్ముతున్నారు.

నీటి కలుషితంపై మున్సిపల్ డిఇ అబ్దుల్ రహీంను వివరణ కోరగా నీటిని శుద్ధి చేసేందుకు టర్మినల్‌లో 'ఆలం' అనే కెమికల్‌ను కలుపుతామని, అనంతరం శానిటరీ బిట్స్ ద్వారా చెరువు నుంచి ట్యాంక్‌లోకి వచ్చే నీళ్లలో ఫ్లోరిన్ గ్యాస్ (బ్యాక్టీరియా చనిపోవటానికి) నిత్యం రెండున్నర లీటర్లు నీటిలో కలిపి పంపింగ్ చేస్తున్నామని చెప్పారు. అయితే అంతవరకు బాగానే ఉన్నా నీరు పైపులైన్లలోకి వచ్చిన తరువాత కలుషితం అవుతోందని పట్టణ ప్రజలు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో నీటిలో పురుగులు రావడంతోపాటు మామూలుగా వచ్చిన నీరు కూడా ఒకటి రెండ్రోజులు నిల్వ చేశాక పురుగులు వస్తున్నాయని వాపోతున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వరం స్పందించాలని, జనం రోగాల బారిన పడి ప్రమాదాలు వాటిల్లక మునుపే పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. జనం ప్రాణాలతో చెలగాటం వద్దని, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే కుదరదని, ముందస్తు చర్యలు ముఖ్యమని గుర్తు చేస్తున్నారు.

నేడు పుతుంబాక వెంకటపతి వర్ధంతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి : రైతు ఉద్యమ నేత, సత్తెనపల్లి సిపిఎం మాజీ ఎమ్మెల్యే పుతుంబాక వెంకటపతి 33వ వర్ధంతి సభ సత్తెనపల్లి పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డి.విమల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వెంకటపతి స్తూపం నివాళులర్పిస్తామని తెలిపారు. వెంకటపతి చిన్నతనం నుండే కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై ప్రజా సమస్యలపై, రైతు సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఊటుకూరు సర్పంచ్‌గాను, ఫిరంగిపురం సమితి అధ్యక్షులుగాను, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించి ప్రజా ప్రతినిధులు ఎలా ఉండాలి అని చేసి చూపించారని పేర్కొన్నారు.

నిబంధనలు మీరిన 33 వాహనాలపై కేసులు



వాహన ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా రవాణా శాఖాధికారి జి.సంజీవ్ కుమార్ అన్నారు. నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డు, గుంటూరు రోడ్డు, వినుకొండ రోడ్డులో రవాణా, పోలీసు, ఆర్టీసీ శాఖల ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రవాణా శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వాహనాల తనిఖీ నిరంతరం జరుగుతుందని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. పరిమితికి మించి బరువుతో ప్రయాణిస్తున్న వాహనాలు, ధ్రువపత్రాలు సరిగా లేని వాహనాలపై మొత్తంగా 33 కేసులు నమోదు చేశామని, 7 వాహనాలను సీజ్ చేసి రూ.2.20 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామని వివరించారు. తనిఖీల్లో నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు, మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎన్.శివనాగేశ్వరరావు, నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై వీధి నాటకం ద్వారా అవగాహన



హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

హెచ్ఐవి ఎయిడ్స్‌పై పల్నాడు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాకారుల బృందం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈప్రభ కల్చరల్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం మాచర్ల బస్ స్టాండ్‌లో జానపద కళారూపమైన వీధి నాటకాన్ని గురువారం ప్రదర్శించారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్ఐవి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, హెచ్ఐవి /ఎయిడ్స్- క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్ఐవి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, సుఖవ్యాధులు, చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగం గురించి అవగాహనా కల్పించారు. హెచ్ఐవి పరీక్ష అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని , హెచ్ఐవి /ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారు ఎఆర్‌టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో దాచేపల్లి రీడ్స్ సిబ్బంది, గౌస్, కోమలి, మౌలాబి, మస్తాన్‌బి, ఆశా, కళాజాత బృందం, వీర్నాల మల్లికార్జునరావు, వెంకటలక్ష్మి, మిర్యాల మలయ్య, కనకరావు, ప్రభావతి, శాంతి పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి

రుతుక్రమం సహజ ప్రక్రియ

వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

అవగాహన ర్యాలీని ప్రారంభించిన పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రుతుక్రమ సమయంలో మరింత జాగ్రత్తలు పాటించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించుకోవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సూచించారు. రుతుక్రమం - ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా రుతుక్రమం సందర్భంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ బి.రవి మాట్లాడుతూ 10-45 ఏళ్ల వయస్సు మహిళలకు రుతుస్రావం సర్వసాధారణమన్నారు. రుతుక్రమం సమయంలో రెండు పూటలా స్నానం చేయాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తినాలని సూచించారు. రుతుస్రావం సహజమైనదిగా భావించాలని, ఎక్కడున్నా తమ రుతుస్రావాన్ని సురక్షితంగా, శుభ్రంగా, గౌరవంగా నిర్వహించుకునే హక్కు ఉందని చెప్పారు. సమతుల ఆహారంతో క్రమం తప్పకుండా రుతుస్రావం వస్తుందని, అది ఆరోగ్యానికి ఎంతో మేలని అన్నారు. పాఠశాల విద్యలో సమగ్ర రుతుస్రావ విద్యను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యంపై విద్యార్థులకు సైతం అవగాహన కల్పించవచ్చని చెప్పారు. కిశోర బాలికల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై ప్రజాసంఘాల మండిపాటు

- బాధిత యువకుల కుటుంబాలకు నాయకుల పరామర్శ
- హైకోర్టు సుమోటోగా తీసుకుని కేసునమోదు చేయాలి : కెవిపిఎస్
- సిఐలను సస్పెండ్ చేయకుంటే చలో ఐతానగర్ : మాజీ ఎంపి
- బాధితుల కోసం న్యాయ పోరాటం : పౌరహక్కుల సంఘం



కెవిపిఎస్ నాయకులకు తన కుమారుడు గురించి చెబుతున్న తల్లి

ప్రజాశక్తి - మంగళగిరి

దళిత, మైనార్టీ యువకులపై నడిరోడ్డుపై అత్యంత దారుణంగా వ్యవహరించిన పోలీసులను తక్షణమే విధుల నుండి తొలగించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరి పట్టణంలోని టిప్పర్ల బజారులోని షేక్ బాబూలాల్ బాధిత కుటుంబాన్ని కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెనాలి అయితానగర్లో జరిగిన ఘటనను సుమోటాగా తీసుకొని కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ కేసులోనైనా నిందితులకు శిక్షలు అమలు చేసే అధికారం కోర్టు పరిధిలో అంశమని, దానిని ఉల్లంఘించి పోలీసులు లాఠీలతో నిందితులపై దాడి చేయడం మానవ హక్కుల ఉల్లంఘనేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. విజిలెన్స్ మానిటరీ కమిటీ సమావేశాలు సీఎం, మంత్రులు, కలెక్టర్ల స్థాయి వరకు జరగడంలేదని విమర్శించారు. సంవత్సరానికి నాలుగు సార్లు జరగాల్సి ఉండగా గత వైసిపి ప్రభుత్వం లోను, టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ జరగలేదని అన్నారు. దీన్నిబట్టి దళిత గిరిజనులపై పాలకులకు ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవతుందని అన్నారు. ఇప్పటికైనా సమావేశాలు జరిపి, రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీలపై జరిగే దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. పోలీసులు విశిక్షణారహితంగా కొట్టడమే కాకుండా రౌడీ షట్ ఓపెన్ చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వ స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీ సంఘాలతో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. సీఐ స్థాయిలో ఉన్న పోలీస్ అధికారులు కూడా చట్టాలపై అవగాహన లేకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయంగా, ప్రతినిధిగా 40 సంవత్సరాల అనుభవం ఉందని చెప్పే వ్యక్తికి ఇలాంటి ఘటనలు కనపడటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కేవలం దళిత, గిరిజన, మైనార్టీలపై ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. అగ్రవర్ణాలు పోలీసుల పై అనేక పర్యాయములు దాడులు చేసినప్పటికీ పట్టించుకోరని అన్నారు. వారికి రాజకీయ, ఆర్థిక అంగ బలం ఉండడంతో పాలకవర్గాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జె నవీన్ ప్రకాష్, ఎం రవి, డిహెచ్ పిఎస్ నాయకులు కె ఈశ్వరరావు, జీవి రాజు పాల్గొన్నారు.

పెళ్లికని వెళ్లి ఇలా అయిపోయాడు

ఎలాంటి సంబంధమూ లేదు బాబూలాల్ తల్లి ఆవేదన

తెనాలి ఘటనలో బాధిత కుటుంబమైన షేక్ బాబూలాల్ తల్లి రెహమత్ మాట్లాడుతూ పెళ్ళికి అని చెప్పి వెళ్లి ఇలా అయిపోయాడని వాపోయింది. కానిస్టేబుల్ సివిల్ డ్రెస్ లో ఉండడంవల్ల పోలీస్ అని తెలియక ఘర్షణ పడటం జరిగిందన్నారు. ఆ తర్వాత రెండు రోజులకి కానిస్టేబుల్‌తో మరో పోలీసులు మంగళగిరి ఇంటికి వచ్చి బాబులాల్‌ను తీసుకువెళ్లారని వాపోయారు. కారులోనే కొట్టుకుంటా తీసుకువెళ్లారని తెలిపారు. మూడు రోజులు పాటు స్టేషన్లో పెట్టి హింసించారని చెప్పారు.

ప్రజాశక్తి - తెనాలి

గంజాయి మామూళ్ల కోసం దళిత మైనారిటీ యువకులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని, ఈ ఘాతుకానికి పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తెనాలి వచ్చిన ఆయన బాధిత కుటుంబ సభ్యుల ద్వారా వివరాలను తెలుసుకొని వారిని పరామర్శిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో హర్ష కుమార్ మాట్లాడుతూ నడిరోడ్డుపై టూ టౌన్ సిఐ రాముల నాయక్, త్రీ టౌన్ సిఐ ఎస్ సురేష్ బాబు అత్యంత పాశవికంగా దళిత యువకులపై లాఠీలతో దాడి చేయడం దేశం యావత్తూ వీక్షించిందన్నారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదని, అందుకు పోలీసులు కూడా అతీతులు కాదన్నారు. దళితులు, మైనారిటీలను బాధించాలన్న ప్రభుత్వ అజెండాకు అనుగుణంగా పోలీసులు వ్యవహరి స్తున్నారని న్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాలది హత్యేనని బహిరంగంగా సవాలు చేసినా పోలీసులకు దమ్ము లేక తనను అరెస్టు చేయలేదన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఘటనను సోషల్ మీడియా వేదికగా వీక్షించినప్పటికీ ఇంకా సిఐలను వెనకేసుకు రావడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఐపీఎస్ అధికారిగా ఇప్పటికైనా ఘటనకు బాధ్యులైన సిఐలపై కేసు నమోదు చేసి వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, వారం రోజుల లోగా ఎలాంటి చర్యలు లేకుంటే చలో తెనాలి ఐతానగర్ పిలుపునిచ్చి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ కేవలం తెనాలిలో గంజాయి విక్రయాలను టూటౌన్, త్రీ టౌన్ సిఐలే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాల నుంచి దాదాపు లక్ష రూపాయలు లంచంగా వసూలు చేసినట్లు ఆధారాలున్నాయని, గంజాయి కేసులలో ముడుపులు చెల్లించని కారణంగానే దళిత యువకులపై సీఐలు జులుం ప్రదర్శించారన్నారు. దళిత యువకులపై దాడి చేసిన సిఐలు ఇరువురిని ఉద్యోగాల నుంచి తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఐక్యవేదిక నాయకులు అక్కి దాసు కిరణ్ కుమార్ , బిఎస్పీ నాయకులు కారుమంచి సునీల్ సందీప్ పాల్గొన్నారు.



బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకుల బృందం

ప్రజాశక్తి - తెనాలి

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన పోలీసులే అతిక్రమించారని హైకోర్టు న్యాయవాది యు డి జై భీమారావు అన్నారు. పౌర హక్కుల సంఘం నేతలతో కలిసి హైకోర్టు న్యాయవాదులు తెనాలి ఘటనపై బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. వారి ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పోలీసులు అమానుషంగా వ్యవహరించారన్నారు. చట్టాల అతిక్రమణను న్యాయవ్యవస్థ సహించబోదన్నారు. ఘటన వెనుక బలమైన కారణాలు ఉన్నాయని, వాటన్నిటిని సమీక్షించి బాధితులకు న్యాయం జరిగేలా వ్యవహరిస్తామన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ చట్టాన్ని చేతిలోకి తీసుకుని, పోలీసులు దళిత యువకులపై దాడి చేయడం సమాజానికే అత్యంత ప్రమాదకరమన్నారు. న్యాయవ్యవస్థ చేయాల్సిన పనిని పోలీసులు అమలు చేయడం పౌర హక్కుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడం వరకే పోలీసులపై విధి అని, నేరం రుజువైతే శిక్షించాల్సింది కోర్టని చెప్పారు ఇలాంటి ఘటనలపై పౌర సమాజం కూడా స్పందించాలన్నారు. భారత ప్రజా న్యాయవాదుల సంఘం ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది డి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆదిపత్య సామాజిక వర్గాలకు అనుకూలంగా పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై మానవహక్కుల సంఘం స్పందించి సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు కె.వి రత్నం, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిఎల్‌డిఓ పిచ్చి రెడ్డి

యానిమేటర్ తొలగింపుపై విచారణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామ సమైక్య సంఘం యానిమేటర్ శ్రీకాంత్ తొలగింపు గురువారం విచారణ చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన నేపద్యంలో కలెక్టర్ నాగలక్ష్మి గుంటూరు డీఎల్ డీఓ పిచ్చిరెడ్డి ఎంక్వయిరీ అధికారిగా నియమించారు. అయితే వారు గురువారం గొట్టిపాడు లోని పంచాయతీ కార్యాలయంలో రాధాకృష్ణ గ్రామ సమైక్యం సభ్యులను డిఎల్‌డిఓ పిచ్చిరెడ్డి సభ్యుల అభిప్రాయాలను ఒక్కొకరుగా విచారణ చేసి వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. గ్రామ సమైక్య సంఘం వద్ద నుండి సేకరించిన అభిప్రాయాలను కలెక్టర్‌కి నివేదించనునట్లు విచారణ అధికారి డిఎల్‌డిఓ పిచ్చి రెడ్డి తెలిపారు.

ఏపీ ఎడ్‌సెట్‌కు అనూహ్య స్పందన

- వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు..
- నేటి నుంచి డౌన్లోడ్‌కు అవకాశం
- కన్వీనర్ ప్రొఫెసర్ ఎవివిఎస్ స్వామి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీ ఎడ్‌సెట్ 2025కి అనూహ్య స్పందన లభించినట్లు ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి తెలిపారు. గతంతో పోల్చుకుంటే సుమారుగా 65 శాతం మంది అభ్యర్థులు అదనంగా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మ్యాథ్స్ మెథడాలజీకి 5191 దరఖాస్తులు రాగా, ఫిజికల్ సైన్స్ మెథడాలజీకి 2045, బైలాజికల్ సైన్స్ మెథడాలజీకి 4323, సోషల్ స్టడీస్ మెథడాలజీకి 5418, ఇంగ్లీష్ మెథడాలజీకి 814 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఏపీ ఎడ్ సెట్ 2025 కి 17791 దరఖాస్తులు వచ్చాయని కన్వీనర్ స్వామి తెలిపారు.

నేటి నుంచి హాల్ టికెట్లు పొందవచ్చు...: రాష్ట్రవ్యాప్తంగా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సులలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను శుక్రవారం నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు అన్నారు.

జూన్ 5న ఏపీ ఎడ్‌సెట్ : జూన్ 5వ తేదీన జరగనున్న పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 87 ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. అదేవిధంగా పదివేల అపరాధ రుసుంతో జూన్ 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆచార్య ఏవీవీఎస్ స్వామి చెప్పారు.



కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులతో జిల్లా నేతలు

ఎమ్మెల్యే మాధవిరెడ్డిని కలిసిన ఆలపాటి, గళ్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : కడపలో మహానాడుకు హాజరు అయిన పలువురు జిల్లా నేతలు స్థానిక శాసనసభ్యులు రెడ్డప్పగారి మాధవి రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టిడిపి అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి రామచంద్రరావు మాధవి రెడ్డి దంపతులను ఘనంగా సన్మానిం చారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పలువురు నేతలు వీరి వెంట ఉన్నారు.

రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షం నీరు రోడ్ల మీద నిలవకుండా డ్రైన్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రధాన డ్రైన్లలో పూడిక తీత పనులను వేగవంతం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ బాలాజీనగర్, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలకు డ్రైన్లలో నీరు సక్రమంగా పారుదల ఉండేలా పూడిక తీత చేపట్టామని, డ్రైన్ల మీద ఆక్రమణదారులకు ఇప్పటికే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సమాచారం ఇచ్చామని, త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. డ్రైన్లలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, పనులకు ముందు, తర్వాత ఫొటోలతో పూడిక తీత వివరాలు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతర్గత డ్రైన్లు మేజర్ డ్రైన్లలో కలిసే చోట తప్పనిసరిగా మెష్‌లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి వలన ప్లాస్టిక్ వ్యర్థాలను అడ్డుకోవచ్చన్నారు. ఆయా ప్రాంతాల్లో నిలిచే వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా డ్రైన్ల ఓవర్ ఫ్లో తగ్గించుకోవచ్చన్నారు. వర్షాల వలన నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని జెట్టింగ్ యంత్రాల ద్వారా బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు సిద్దంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు కూడా వ్యర్థాలను డ్రైన్లలో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకే అందించాలని కోరారు. పర్యటనలో ఏఈ పి.వెంకటేశ్వరరావు, టిపిఎస్ లక్ష్మణస్వామి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



బాలాజీ నగర్‌లో డ్రైన్లు పరిశీలిస్తున్న కమిషనర్

ఘనంగా ప్రత్తిపాటి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవాన్ని పుర స్కరించుకొని పట్టణ, నియోజకవర్గ స్థాయిలో వాడా వాడల జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భాస్కర్ ఫ్యాన్సీ వద్ద ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో 100 కేజీల కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బిస్కెట్లు, పండ్లు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, టీడీపీ నాయకులు ఆర్య వైశ్య ప్రముఖులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, మండల టిడిపి అధ్యక్షుడు జవ్వాజి మదన్మోహన్, ఎడ్లపాడు మండల అధ్యక్షులు కామినేని సాయిబాబా. టిడిపి నాయకులు దగ్గు మల్లి సాంబశివరావు. కన్నెర నాగేశ్వరావు, షేక్ అజహరుద్దీన్, అబ్దుల్ మజీద్‌చ ఆరేపల్లి రాము, బిసి యూత్ కరీముల్లా సయ్యద్ రఫీ. ఎలగాల ఏసుబాబు. తన్నీరు పుల్లారావు, మునిసిపల్ కౌన్సిలర్లు. బేరింగ్ మౌలాలి, సాయి తిరుమల, కూనాల ప్రమీల. కొత్త కుమారి, రాయని హరిత, కంచర్ల కరుణ జంగా సుజాత, ఆర్యవైశ్య సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు : ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల

కడప గడ్డపై పసుపు సైన్యం పండుగ మహా నాడును విజయ వంతం చేసిన ప్రతిఒక్కరికీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఓ ప్రకటనలో కతజ్ఞతలు తెలియజేశారు. కడప కేంద్రంగా మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన మహానాడు ఎంతో అద్భుతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఎటువంటి లోటు లేకుండా అన్నీ ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివఅద్ధికి పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047 కు పిలుపునివ్వగా.., ఆయన సంకల్పం సఫలీకఅతం అయ్యేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కార్యకర్తల అభ్యున్నతికీ ఆరు శాసనాలను ప్రవేశపెట్టారని వివరించారు. మాచర్ల నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కార్యక్రమాలను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలియజేశారు.



వర్షితకు సిపి అభినందన

ప్రజాశక్తి-విజయవాడ

గత నెల 24 నుంచి 28 వరకు బోపాల్‌లోని లోయర్ లేక్ వేదికగా జరిగిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్ షిప్‌లో కంస్య పతకం సాధించిన అథ్లెటిక్ గొలుగూరి వర్షితను పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు అభినందించారు. పటమట ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్నట్లు, కెనోయ్ ఈవెంట్ లో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ నుండి వర్షిత ఒక్కర్తే ఎంపిక అయినట్లు, బోపాల్ నందు జరిగిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్ షిప్ లో సబ్ జూనియర్ కె4 500 మీటర్ల విభాగంలో ఒడిశా జట్టుకు ప్రాతినిధ్య వహించి తృతీయ స్థానం సాధించినట్లు వివరించగా, వర్షిత చదువుల్లో, అథ్లెటిగ్గా రాణించి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆకాంక్షించారు.


ప్రజల ప్రాణాలు తీస్తున్న రుణ యాప్‌లు..!



- ఆర్బీఐ నిబంధనలు పాటించని రుణ యాప్‌లు
- రూ.200 వందల నుంచి రెండు లక్షల దాకా సెక్యూరిటీ లేని రుణాలు...
- ఎంత వేగంగా ఇస్తారో - అంతే వేగంగా హింసించి వసూల్...

ప్రజాశక్తి- చిలకలూరిపేట

ఆన్‌లైన్ వేదికగా పేదల ప్రజలను ఆకర్షిస్తున్న రుణయాప్‌లు ఆర్బీఐ నిబంధనలు పాటించడం లేదు. దీనికితోడు రూ. 200 నుండి రెండు లక్షల దాకా ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నాయి. దీంతో వేలాది మంది ప్రజలు ఆకర్షితులై ఈ రుణయాప్‌లలో లోన్లు తీసుకుని అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రకటనల్లో చెప్పిన మాదిరిగా రుణయాప్‌లు లోన్లు తీసుకున్న వారిని అనేక ఇబ్బందులకు గురిచేస్తూ హింసిస్తున్నాయి. రుణాలు తీసుకున్న తర్వాత బ్యాంకులలో డబ్బులున్న కూడా చెక్ రిటన్ అయినదని దాని నిమ్మి త్తం ఛార్జీలని,రోజు వారి వడ్డీలని, అ ధిక మొత్తల రేట్లతో వేధింపులతో మానశికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో ఏమి చేయాలో తెలియక, ఎవరికి చెప్పుకోక వందలాది మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అవసరాలు కోసం కొంత మంది, అనుకోని ఖర్చుల కోసం మరికొందరు, క్రికెట్, ఆన్‌లైన్ గేమ్స్ తదితర క్రీడల్లో బెట్టింగ్ పెట్టేందుకు ఇంకొందరు అనేక మంది ఈ యాప్‌లలో రుణాలు తీసుకుంటున్నారు. వీటిలో ఎక్కువ భాగం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు అమలు చేసే వారుకాక పోవడం, ఆర్బీఐ నిబంధనలు ఎక్కడా అమలు చేయకుండానే కోట్ల రూపాయలు అప్పులిస్తున్నారు. తీసుకున్న వారు తిరిగి



చెల్లించెందుకు కొద్ది పాటి ఆలస్యం చేసిన వెంటనే రకరకాల నెంబర్లతో ఫోన్లు చేయ టమే కాక యాప్ నిర్వాహకులు వ్య క్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేస్తూ వేధిస్తుంటారు. దీంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 12 నుంచి 24శాతం వడ్డీ కొందరు వసూలు చేస్తుంటే, వడ్డీ లేదని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు, లాగిన్ ఫీజు ఇతర ఫీజులని అని చెప్పిఅధిక మొత్తాల్లో అక్రమ వసూలు చేస్తున్నారు. అవసరం కాబట్టి రుణం తీసుకున్న వారిని పీల్చి పిప్పిని చేస్తున్నారు. చాలామంది యువ త బెట్టింగులు, ఆన్లైన్ గేమ్స్‌లో (జె ట్, రమ్మీపింగ్ పాగ్ లాంటి మొదలగు) పాల్గొనేందుకు రుణాలు తీసుకుం టున్నారు. అందులో 200 నుంచి వెయి రూ.కూడా అప్పు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. 200 నుంచి రెండు లక్షల వరకు రుణాలు ఇచ్చే యాప్‌లు ఉండి ఇవి లోన్లు ఇచ్చేటప్పు డు ఎంత వేగంగా ఇస్తారో వసుల వి షయంలో అంత క్రూరంగా ప్రవర్తిస్తా రు. అప్పటికి చెల్లించక పోతే ఫోటో లు మార్ఫిం గ్ చేసి ఫోన్లో ఉన్న నెంబ ర్లకు పంపిస్తు టారు. రికవరీ ఏజెంట్ల ను ఇంటికి పంపిస్తారు. వారు ఇళ్లకొచ్చి నానా గోల చేస్తారు. పరువు తీసేస్తున్నారు. మహిళల ముందు డబ్బులు అడిగే విధానానికి భిన్నంగావసూలు చేసేందుకు ప్రయత్ని స్తుంటారని పలువురు బాధితులు తెలుపుతున్నారు. ఇకనైనా పోలీసులు కలుగ జేసుకుని ఇలాంటి యాప్‌లను నిషేధించాలని, పచ్చని కాపురాల్లో చిచ్చుపెట్టకుండా చూడాలని, దేశ భవిష్యత్‌కు మార్గదర్శిగా నిలిచే యువత ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పవన్ కళ్యాణ్ కృషితోనే కూటమి అధికారం..


సభ్యత్వాల కిట్లను పంపిణీ చేస్తున్న వెంకట సుబ్బమ్మ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారాన్ని చేపట్టడంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కృషి ఉందని పార్టీ వీర మహిళ, జిల్లా ఏరియా హాస్పిటల్ అభివృద్ధి సొసైటీ మెంబర్ మిరియాల వెంకట సుబ్బమ్మ అన్నారు. బుధవారం రాత్రి రామిరెడ్డిపేటలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం అనేది ఒక భావోద్వేగం అన్నారు. రాబోయే కాలంలో పార్టీ అభిమానులను క్రియాశీలక సభ్యులుగా చేర్పేందుకు జనసైనికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్ బాబు, ప్రకాశం జిల్లా కార్యదర్శి చల్లా వెంకటకృష్ణ, వినుకొండ జనసేన పార్టీ నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, నరసరావుపేట మండల అధ్యక్షుడు కిష్టంశెట్టి గోవిందరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గుప్తా, యలమల కొండలరావు క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ప్రణాళిక

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి
- 11 స్కీమ్స్‌పై అవగాహన సదస్సులు
- చెంచుగూడెంలలో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ గిరిజనుల సంక్షేమం , అభివృద్ధి కోసం ప్రధాన జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా పలు చర్యలు చేపడుతోంది. ఈ పథకం ద్వారా, ప్రత్యేకంగా అత్యంత వెనుకబడిన గిరిజన సముదాయాల (పివిటిజి) కోసం మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు.పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, కారంపూడి, బొల్లాపల్లి, రెంటచింతల మండలాల్లోని చెంచు గిరిజన సముదాయాలకు చెందిన 51 గూడెంలలో మొదటి విడతగా 9 శాఖల సమన్వయంతో 11 స్కీమ్‌లపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల ద్వారా గిరిజనులకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, ప్రభుత్వానికి నివేదించి, వాటిని కల్పించే ప్రక్రియ జరుగుతోంది. రెండో విడతలో, జిల్లాలోని నాన్-పివిటిజి మండలాల్లోని 31 చెంచు గూడెంలలో కూడా 11 రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది.అదేవిధంగా, గిరిజనుల అభివృద్ధి కోసం మరో పథకం ధర్తీ ఆదివాసీ జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డి ఏ -జేజి యు ఏ) కూడా అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద, దుర్గి, మాచర్ల, అచ్చంపేట, దాచేపల్లి, బొల్లాపల్లి మండలాల్లోని 17 గిరిజన హేబిటేషన్లలో 17 శాఖల సమన్వయంతో 25 స్కీమ్‌లపై అవగాహన సదస్సులు నిర్వహించి, అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, డి ఎ- జేజ యుఏ పథకం కింద దుర్గి, మాచర్ల, అచ్చంపేట, దాచేపల్లి, బొల్లాపల్లి మండలాల్లో 2025 జూన్ 15 నుండి జూన్ 30 వరకు గిరిజన సంక్షేమ శాఖ మరియు సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సదస్సుల్లో గిరిజన ప్రజలు పాల్గొని, ఆధార్, బ్యాంకు ఖాతా, హెల్త్ కార్డు, గ్యాస్ కనెక్షన్, జాబ్ కార్డు, విద్యుత్ కనెక్షన్, కుళాయి కనెక్షన్, అటవీ భూమి సమస్యలు, ఇండ్ల నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాల ద్వారా గిరిజన సముదాయాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి- నరసరావుపేటటౌన్

మార్నింగ్ విజిట్ లో భాగంగా గురువారం రెండో వార్డ్ లోని సింహాల మేడ బజార్లో జరుగుతున్న కాలువ పూడికల పనులను, తత్వాచెరువు మేజర్ డ్రైన్ క్లీనింగ్ పనులను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు దగ్గరుండి పరిశీలించారు. జరుగుతున్న పని పురోగతిని సమీక్షిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వార్డులలో విధులు నిర్వహిస్తున్న వార్డు ఎమినిటీ సెక్రటరీ, వర్క్ ఇన్స్పెక్టర్ మరియు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను కలిసి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. పట్టణంలోని 34వ వార్డులో పూడిక పనులను నిర్వహిం చేందుకు 40 లక్షల రూపాయలతో టెండర్లను పిలిచి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.పనుల నాణ్యత పట్ల అన్ని శాఖల వారు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన వర్షాలకు ముందుగానే పనులన్నీ పూర్తి చేయాలని అదే విధంగా తీసిన పూడికలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో యోగాంధ్ర యాప్ ద్వారా యోగా ఔత్సాహిక రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 8.5 లక్షల మందిని యోగా ఔత్సాహికులను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకూ 3 లక్షల మంది నమోదు పూర్తయిందన్నారు. ఈ నెల 26 నుంచి గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న యోగా పోటీలను అన్ని గ్రామాల్లో పూర్తి చేసి విజేతల వివరాలు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో విజేతలకు జూన్ 2 నుంచి మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఆస్పత్రి ఉన్నా.. వైద్యపరీక్షలు లేవక్కడ..!

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అనారోగ్యం బారిన పడిన ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణమైన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ఏమైనా పరీక్ష చేయించుకోవాలా? అక్కడ రక్త పరీక్ష, కళ్ళే పరీక్ష, కళ్ళు పరీక్ష, యూరిన్ పరీక్షా వంటివి ఏమైనా సరే అక్కడ అందుబాటులో లేవు. సాధారణ జబ్బులు బిపి, షుగర్, జ్వరము వంటి వాటికే మందులు ఇచ్చి పంపేస్తారు. అనుకోని విధంగా ఎవరికైనా ప్రమాదం జరిగి గాయాల పాలైతే ప్రాథమిక చికిత్స వరకే మాత్రమే అందించే, డాక్టరు, సిబ్బంది మాత్రమే ఉన్నారు. మండల స్థాయిలో తాడేపల్లి పట్టణం సీతానగరం వద్ద ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరువాత రూరల్ గ్రామాల ప్రజల సౌకర్యార్థం కోట్ల రూపాయలతో నిర్మాణం జరుపుకున్న



కుంచనపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

కుంచనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందరికీ అందుబాటులో ఆసుపత్రి ఉందని చెప్పుకోవడం మినహా అక్కడ అన్ని వైద్య పరీక్షలు జరగడం లేదు. ఒక మెడికల్ అధికారి(ఎం ఓ), ల్యాబ్ టెక్నీషియన్, రోగి వివరాలు నమోదు చేసే ఓ నర్స్ మాత్రమే ఉన్నారు. పెరిగిన జనాభా, వాతావరణం కాలుష్యం అధికంగా పెరిగి, ప్రజలు అనేక జబ్బుల బారిన పడుతున్నారు. ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించి ఆస్తమా, నిమోనియా వంటి వ్యాధుల నిర్ధారణకు అవసరం అయ్యే కళ్ళే పరీక్ష చేయించుకోవాలి అంటే సీతానగరం ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని, ఇక్కడ అటువంటి పరీక్షలు ఏమీ లేదని, అక్కడ సిబ్బందే రోగులకు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో గర్భిణీ స్త్రీలు ప్రసవం అయ్యేందుకు మహిళా వైద్యురాలి కూడా లేదు. అన్ని పరీక్షలు చేసే, ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ సౌకర్యం లేనప్పుడు, కోట్ల రూపాయలు వెచ్చించి, ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించడం దేనికో అర్థం కాని పరిస్థితి. సంబంధిత వైద్యశాఖ అధికారులు కుంచనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా ల్యాబ్ ను ఏర్పాటుచేసి, మహిళలకు ప్రత్యేకించి వైద్యురాలని ఏర్పాటు చేస్తే, రూరల్ గ్రామాల ప్రజలు సీతానగరం ఆసుపత్రి దాకా ప్రయాసపడి వైద్యం చేయించుకోకుండా ఇక్కడే అన్ని రకాల వైద్య సదుపాయాలు పొందవచ్చని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్..

రత్నాల చెరువులో పోలీసులు విస్తృత తనిఖీలు..

ప్రజాశక్తి - మంగళగిరి

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమం దోహదపడుతుందని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ రవికుమార్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని రత్నాలు చెరువులో గురువారం ఉదయం 6 గంటలకు పోలీసులు కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తఅత తనిఖీలు చేపట్టారు. అదనపు ఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ 120 మంది పోలీస్ సిబ్బంది సహకారంతో రత్నాల చెరువులో కార్డెన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు. సరైన పత్రాలు లేని 85 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్థానిక ఆలయం, పాఠశాల వద్ద ఆకుతాయి యువత బహిరంగ మద్యపానం సేవించడం వలన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని రత్నాల చెరువు ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రతిరోజు రాత్రి సమయంలో పోలీస్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ టెక్నాలజీని వినియోగించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి మురళీకృష్ణ, పట్టణ సీఐ డి.వినోద్ కుమార్, రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు, మంగళగిరి రూరల్ ఎస్సై మహేష్, తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్, జె.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రత్నాల చెరువులో కార్డెన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు




మాట్లాడుతున్న సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్, సమావేశంలో పాల్గొన్న పోలీస్, అగ్నిమాపక శాఖ, ఇతర అధికారులు

రాజధానిలో కార్మికుల భద్రతకు ప్రాధాన్యత నివ్వండి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో కార్మికుల భద్రత, సంక్షేమంకు అధిక ప్రాధాన్యత నివ్వాలని సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, కార్మికుల భద్రత ఏర్పాట్లుపై గురువారం విజయవాడలోని సి ఆర్డిఎ కార్యాలయంలో పోలీస్, అగ్నిమాపక శాఖ, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్తో పాటు గుంటూరు జిల్లా ఎస్ పి ఎస్ సతీశ్ కుమార్, గుంటూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, సిఆర్డిఎ ఇ ఎన్ సి ఆర్ గోపాలకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఎటివి రవికుమార్, రాజధాని ప్రాంతంలోని పోలీస్ స్టేషన్ల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షణ,కార్మికుల భద్రతకై అమరావతి అభివృద్ధి సంస్థకు పలు సూచనలు చేశారు. కార్మికుల భద్రతకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలను నిర్మాణ సంస్థలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. బాలకార్మికులు, లింగవివక్షకు రాజధాని నిర్మాణ పనులలో తావు లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, కార్మికుల భద్రతకు సంబంధించిన అంశాలలో పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సి ఆర్ డి ఎ,ఎడిసి అధికారులు, సి ఆర్ డి ఎ లోని ప్రోగ్రాం మేనేజ్ మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్టు మేనేజ్మెంట్ కన్సల్టెన్సీ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులలో గుత్తేదారు సంస్థలు పాటించవలసిన నిర్దేశిత ప్రమాణాలను స్పష్టంగా ఇప్పటికే తెలియజేశామని, పి ఎం సి సిబ్బంది ఈ ప్రమాణాలను పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. ప్రతి నెలా అమరావతిలోని అన్ని సైట్లలో క్రైమ్ మిటిగేషన్, ఫైర్ సేఫ్టీపై పోలీస్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన,శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాజధాని పనులలో పాలుపంచుకుంటున్న కార్మికుల వివరాలు, వినియోగిస్తున్న ట్రక్కులు, జెసిబి తదితర యంత్రాల నమోదు నిర్వహిస్తూ పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు అదనపు కమిషనర్ సూచనలిచ్చారు.

జిల్లా ఎస్పి ఎస్ సతీష్ కుమార్ పాటు ఇతర అధికారులు సమావేశంలో తెలియపరచిన అంశాలను, అందజేసిన సూచనలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామన్నారు. పోలీస్ శాఖకు సిఆర్డిఎ అధికారులు అన్ని విధాలా సహకారం అందజేస్తారని చెప్పారు. సమావేశంలో సిఆర్డిఎ చీఫ్ ఇంజినీర్లు డి రామచంద్ర మూర్తి, సిహెచ్ ధనుంజయ, ఎన్ శ్రీనివాసులు, సి ఆర్ డి ఎ అండ్ ఎ డి సిలోని వివిధ విభాగాల అధికారులు, మంగళగిరి డి ఎస్ పి మురళీకృష్ణ, తుళ్లూరు ఎస్డీపివో మురళీకృష్ణ, సిఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతు సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -మేడికొండూరు

మేడికొండూరు మండలం లోని మందపాడు గ్రామంలో గురువారం ఏపీకౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కౌలురైతుసంఘం గ్రామ అధ్యక్షులుగా మందపాటి శ్రీరాములు కార్యదర్శిగా కొరివి కృష్ణ కమిటీ సభ్యులుగా బిళ్ళ బాబురావు, కనగాల ప్రకాష్, మందపాటి సాంబయ్య, వీరిని కకమిటీ మెంబర్లుగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ సమక్షంలో ఎన్నుకున్నారు.


దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

178వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 178వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు యూనియన్ నాయకులు బి.సూర్యప్రకాష్, పి.అంకయ్య, కె.స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో ఎం.పిచ్చయ్య, కె.అగ్గయ్య, ఎం,గురవయ్య, డి.నాగేశ్వరరావు, ఎం.సుబ్బారావు కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు దుర్గారావు మాట్లాడుతూ ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ శుక్రవారం నాటికి 32 ఏళ్ల పూర్తయిందని ఆందోళనతో పాటు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలం లో 150 మంది కార్మికులు అర్ధాకలి తో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. యాజ మాన్యం, పాలకులు చేసిన హత్యలుగానే భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేడు జరిగే నిరసన కార్యక్రమాల్లో (బ్లాక్ డే) కార్మికులు ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై. సాంబశివరావు, సుభాని, అసిఫ్, డి.నాగేశ్వరావు, ఆశీర్వాదం, టి.నాగేశ్వరావు. బి.అంకయ్య మరియు మహిళలు పాల్గొన్నారు.

నేడు సామూహిక రాయబారం

ప్రజాశక్తి - తుళ్లూరు

శుక్రవారం తుళ్లూరు సి ఆర్ డి ఏ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ డే లో రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి సామూహిక రాయబారం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి తెలిపారు.ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.రాజధానిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాల పెంపుదల చేయాలని, గత ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్ ను పునరుద్ధరించాలని, రాజధానిలో అభివఅద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పెరుగుతున్న జనాభా రీత్యా పారిశుధ్య కార్మికుల సంఖ్య ను పెంచాలని, పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు అందచేయాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు సామూహిక రాయబారం నిర్వహించనున్నట్లుగా తెలిపారు.

ఈవోగా సునీల్ కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఇఓగా కోగంటి సునీల్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సునీల్ కుమార్ ప్రస్తుతం కంఠంరాజు కొండూరు లోని మహంకాళి అమ్మవారి ఆలయ ఇవో గా పని చేస్తున్నారు. మంగళగిరి పానకాల స్వామి ఆలయ ఇవో గా వున్న సహయ కమిషనర్ ఎ.ఆర్.కె. రెడ్డి ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

వర్ష సమస్యలకు జిఎంసిలో కాల్ సెంటర్

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే మూడ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో వర్షాల వలన తలెత్తే సమస్యలు తెలపడానికి జిఎంసి కాల్ సెంటర్ (08632345103) 24 గంటలూ పని చేసేలా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని తెలిపారు. వర్షం వలన ప్రజలకు ఏసమస్యా తలెత్తకుండా జిఎంసి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నా, వర్షం నీరు నిలిచినా తక్షణం జిఎంసి కాల్ సెంటర్‌కి ఫోన్ చేస్తే సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. విరిగిన చెట్లను తొలగించడానికి ఉద్యానవన సిబ్బందిని అందుబాటులో ఉంచి, కాల్ సెంటర్ నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణం హాజరు కావాలన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం వలన తాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవడం, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఈఈలను ఆదేశించారు. మెయిన్ డ్రైన్లలోకి చిన్న డ్రైన్లు కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షణ చేయాలని సిఎంఓహెచ్‌ని ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్ విరిగి, బ్యానర్లు గాలికి ఎగురుతున్నాయని వాటిని తక్షణం తొలగించాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

వినుకొండ-గుంటూరు రోడ్డు నాలుగు లైన్లకు విస్తరణ

భూ సేకరణపై జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ రహదారి ఎన్.హెచ్ 544డి వినుకొండ నుంచి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారి కొనసాగింపులో భాగంగా జిల్లా పరిధిలోని రహదారి విస్తరణ ప్రాంతంలో జాయింట్ మెజర్మెంట్ సర్వేను వెంటనే ప్రారంభించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సంయుక్త కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ ఎన్‌హెచ్ 544డి గుంటూరు వరకు కొనసాగింపు పనులపై జాతీయ రహదారులు, రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి ఎన్.హెచ్ 544డి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారిగా కొనసాగింపుకు సంబంధించి 18 కిలోమీటర్లు జిల్లా పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలలో ఉందన్నారు. రహదారి విస్తరణకు సంబంధించి ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, దీనిపై వచ్చిన రెండు అభ్యంతరాలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు తరలించడానికి విద్యుత్ శాఖ అధికారులతోను, పైపులైన్లు, కాలువలకు సంబంధించి ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఎస్టిమేషన్లు తయారు చేయించాలన్నారు. అదేవిధంగా రహదారి విస్తరణ వల్ల నిర్మాణాలు కోల్పోతున్న వారికి అందించాల్సిన నష్టపరిహారంపైన ఆర్ అండ్ బి అధికారులతో అంచనాలు సిద్ధం చేయించాలన్నారు. రెవిన్యూ అధికారులు సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకొని జాయింట్ మెజర్మెంట్ సర్వే ద్వారా సోమవారం నుంచి ఎస్టిమేషన్ సిద్ధం చేసే పనులను ప్రారంభించి నిర్ధేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు.సమావేశంలో డిఆర్ఓ ఖాజావలి, జాతీయ రహదారుల పిడి పార్వతీశం, ఆర్డీవో కే. శ్రీనివాస రావు, ఫిరంగిపురం , మేడికొండూరు తహశీల్దార్లు ప్రసాదరావు , హరిబాబు , కలక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జిఎంసి, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతులపై ప్రజల తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్లల్లో షుమారు 13 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నారని, సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం తాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీని ప్రజలకు వారి ఇంటి వద్దకు వచ్చే అందించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు, జిఎస్బీ రోడ్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవా లన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వం రావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వర శాస్త్రి, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, జిఎంసి డిఈఈలు శ్రీనివాస్, హనీఫ్, టిడ్కో డిఈఈ సేతు బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను సందర్శించిన నగర కమిషనర్



ఉపాధ్యాయుల పడిగాపులు

- గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్‌లో జాప్యం
- ఉపాధ్యాయ సంఘాలు నిరసన
- రాత్రి 7 గంటల తర్వాత ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల విద్యాశాఖ పదోన్నతుల్లో ఏమి జరుగుతుందో ఉపాధ్యాయులకు అంతు పట్టట్లేదు. ఇప్పుడే ఉన్నఫళంగా కౌన్సెలింగ్‌కు రావాలని అధికారుల నుండి పిలుపు వస్తుంది...ఆవెంటనే వాయిదా వేస్తారు. మళ్లీ మరో తేదీ, సమయం ప్రకటించి, ఉపాధ్యాయుల్ని పిలిచి వేచి ఉండమంటారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రకియలో గత రెండ్రోజులుగా ఇదే తంతు నడుస్తుంది. గురువారం గుంటూరులో నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ సకాలంలో ప్రారంభం కాకపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలోని 79 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కోసం దరఖాస్తు చేసిన ఉపాధ్యాయుల్ని గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్ పిలిచారు. ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయుల్ని పిలిచారు. వాస్తవంగా విద్యాశాఖ ముందు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 30న జరగాల్సిన కౌన్సెలింగ్‌ను అధికారులు ముందుగానే నిర్వహిస్తున్నారు. ఉన్నఫళంగా కౌన్సెలింగ్‌కు రావాలని ఉపాధ్యాయులకు హడావుడి మెస్సేజ్‌లు పంపించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు అక్కడికి చేరుకున్నారు. అయితే ఉదయం నుండి సాయంత్రం వరకూ వేచి ఉన్నా ఉపాధ్యాయులకు ఎదురు చూపులే మిగిలాయి. కౌన్సెలింగ్ మాత్రం నిర్వహించలేదు. పాఠశాల విద్య కమిషనరేట్‌కు పంపిన ఉపాధ్యాయుల జాబితా ఆమోదం పొందలేదని చెబుతూ అధికారులు కౌన్సెలింగ్‌ను నిర్వహించలేదు. దీంతో సాయంత్రం వరకూ అక్కడే పడిగాపులు కాశారు. ఉపాధ్యాయ సంఘాలు అధికారుల తీరుపై కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, శ్రీనివాసరెడ్డి, ఎం.హనుమంతరావు, కుమార్ రాజా, మల్లేశ్వరరావు, ఎపిటిఎఫ్ 938 నర్సింహారావు, వెంకటరెడ్డి, ఎస్టియు పెదబాబు, జోజప్ప, ఎపిటిఎఫ్ 257 బసవలింగారావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులు

ఎట్టకేలకు ప్రారంభం..

గంటల తరబడి ఎదురు చూసిన తర్వాత ఎట్టకేలకు కౌన్సెలింగ్ ప్రారంభం అయ్యింది. ఉదయం 8 గంటలకు జరగాల్సిన కౌన్సెలింగ్ సాయంత్రం 7.30 గంటలకు ప్రారంభం అయ్యింది. జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో 59, మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లోని 8, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్‌లోని 9 మొత్తం 76 గ్రేడ్-2 హెచ్‌ఎంల పోస్టులకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక్కొక్క పోస్టుకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లోని సంయుక్త కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ అధ్యక్షతన జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. సమావేశంలో అజెండాకు సంబంధించి చర్చించిన అంశాలపై భార్గవ్ తేజ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్ఎస్ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమల శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. సింగిల్ డెస్క్‌లో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సంబంధిత శాఖలు సక్రమంగా వెరిఫికేషన్ చేసి పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. సింగిల్ డెస్క్ ద్వారా వచ్చిన 49 దరఖాస్తులకు సంబంధిత శాఖల అధికారులతో చర్చించి 34 దరఖాస్తులను మంజూరు చేస్తూ , 14 దరఖాస్తులను పెండింగ్‌లో వుంచి , ఒక దరఖాస్తును తిరస్కరించారు. జిల్లాలో 18 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, రీయింబర్స్మెంట్ ఆఫ్ ఇంట్రస్ట్ సబ్సిడీ, రీయింబర్స్మెంట్ ఆఫ్ పవర్ కాస్ట్ సబ్సిడీ , రీయింబర్స్మెంట్ ఆఫ్ సేల్స్ టాక్స్ సబ్సిడీ , రీయింబర్స్మెంట్ ఆఫ్ క్వాలిటి సర్టిఫికేషన్ , క్లీనర్ ప్రొడక్షన్ కు సంబంధించి రూ.55,68,580లు మంజూరు చేస్తూ సమావేశంలో ఇన్ చార్జ్ జిల్లా కలెక్టర్ ఆమోదించారు. అదే విధంగా 36 సబ్సిడీ క్లైమ్స్‌ను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ.జయలక్ష్మి , లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్ తేజ

2,3,4 తేదీల్లో వ్యవసాయ సమస్యలపై మండల కేంద్రాల్లో నిరసన

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి జూన్ 2 ,3, 4 తేదీలలో మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు కోరారు. శుక్రవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సహాయాన్ని రైతులు, కౌలు రైతులకు ఇవ్వాలని, కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి ,పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతులను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని, దేవాదాయ భూముల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే బాధ్యత తీసుకొని కంపెనీల ద్వారా కొనుగోలు చేయాలని, లేనిచో ఆందోళనకు పూనుకుంటామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. 50 గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. నల్లమడ వాగు ఆధునీకరణకు నిధులు కేటాయించి, వర్షాకాలంలో పంటలు ముంపునకు గురికాకుండా కాపాడాలని, ప్రభుత్వం వాగ్దానానికి అనుగుణంగా నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి జరిగే ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, వ్యకాస నాయకులు అన్నలదాసు ఆశీర్వాదం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు